క్లుప్తంగా

23న భజన బృందాల ఆత్మీయ సమావేశం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ ఆదివారం ఎన్టీఆర్ జిల్లా స్థాయి భజన బృందాల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు ధర్మప్రచార పరిషత్ ప్రోగామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు రోడ్డు బీఎస్ఎన్ఎల్ సమీపంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశంలో భజన బృందాలు, పారాయణ, నామసంకీర్తన బృందాల వారు పాల్గొనవచ్చన్నారు. తిరుమలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విధి విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఇతరవివరాలకు సెల్‌నంబరు 708 22 55499)లో సంసంప్రదించాలని ఆయన సూచించారు.

ఉత్సవ విగ్రహాలు వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్త సాయి మందిరంనకు దాతలు కోడూరు వెంకటేశ్వరరావు, అన్నపూర్ణమ్మ, పాలడుగు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు రూ. 70వేలు విలువ చేసే ఉత్సవ విగ్రహాలను గురువారం మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ మందిరంలోని ఉపాలయంకు సీతారామ లక్ష్మణ సమేత హనుమాన్ ఉత్సవ విగ్రహాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీతారామలక్ష్మణ సమేత హనుమాన్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దాత టిక్కిశెట్టి నాగభూషణం దంపతుల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ విద్యుత్ ఫీడర్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్నందున శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి 12.30గంటల వరకు విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నట్లు ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపాలరు. పాయకాపురం సెక్షన్ పరిధిలో కండ్రిక, జర్నలిస్ట్ కాలనీ, ఎన్‌జిఓ కాలనీ, రాజీవ్‌నగర్ ,ఎంఐజి కాలనీ, ఎల్ఐజి కాలనీ, ఈడబ్ల్యూఎస్ కాలనీ, విశాలాంధ్ర కాలనీ, డాక్టర్స్ కాలనీ, రాధానగర్, ప్రజాశక్తి నగర్, బర్మాకాలనీ, పాయకాపురం, భగీరథ కాలనీ, ఏవీఎస్‌రెడ్డి రోడ్డు, ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్, ఎల్‌బీఎస్ నగర్, పటేల్ నగర్, లక్ష్మీనగర్, ప్రశాంతినగర్, శాంతినగర్, దేవినేని గాంధీపురం ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపట్నుంచి శాస్త్రీయ నృత్య పోటీలు



విజయవాడ కల్చరల్: భరతముని జయంతి సందర్భంగా సంస్కార భారతి విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి రెండురోజుల పాటు శాస్త్రీయ నృత్యపోటీలను నిర్వహిస్తునట్లు ఆసంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ తెలిపారు. శాస్త్రీయ నృత్యపోటీల బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం అంశాలలో పోటీలు నిర్వహిస్తునట్లు వివరించారు. నగరంలోని కేబీఎస్ కళాశాల, హనుమంతరాయ గ్రంథాలయం, సీతారామా కల్యాణమండపం, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ కళాశాల, అయోధ్యనగర్‌లోని ధర్మప్రచార పరిషత్ కేంద్రాలలో ఈ పోటీలను నిర్వహిస్తునట్లు తెలిపారు. వివిధ అంశాలలో 600 మంది పోటీలో పాల్గొంటునట్లు చెప్పారు. సమావేశంలో సంస్కరభారతి ప్రధానకార్యదర్శి దర్భాశ్రీనివాస్, సంస్కారభారతి నగర అధ్యక్షుడు భాస్కరశర్మ, నిర్వాహకులు శ్రావణ్‌కుమార్, సాయి శంకర్, పి.విశ్వకాంత్, బి.రూపశ్రీ,, పి.సాయి సౌమ్య, బి.చాణిక్య పాల్గొన్నారు.

40 గ్రాముల బంగారం చోరీ

పాయకాపురం(విజయవాడరూరల్): తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి 40 గ్రాముల బంగారం, 5వేల రూపాయల నగదు అపహరించుకుపోయిన ఘటనపై నున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... పాతరాజీవ్‌నగర్‌కు చెందిన పదాల పాపాయమ్మ విజయవాడ సరస్వతీ విద్యాలయంలో ఆయాగా పనిచేస్తోంది. ఈనెల 15వ తేదీన ఆమె కుటుంబసభ్యులతో కలిసి ఫంక్షన్ నిమిత్తం విజయనగరం వెళ్లి బుధవారం తిరిగి ఇంటికి చేరింది. ఈక్రమంలో ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్న వైనాన్ని గమనించిన ఆమె లోపలికి వెళ్లి చూసింది. బియ్యం డ్రమ్ములో పెట్టిన మూడున్నర గ్రాముల బంగారపు నానతాడు, రెండు చెవిదుద్దులు, రెండు ఉంగరాలు మొత్తం 40 గ్రాముల బంగారం, బీరువాలో పెట్టిన 5వేల రూపాయలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధురానగర్‌లో మార్కింగ్ కలకలం

- నేతాజీరోడ్డులో ఫైవంతెన నిర్మాణం అంటూ సర్వే
- గత ప్రణాళికలు బుట్టదాఖలు
- కొత్త సర్వేపై స్థానికుల ఆందోళన
- పప్పులమిల్లు రోడ్డు మీదుగా ఫైవంతన నిర్మించాలని స్థానికుల డిమాండ్



మధురానగర్‌లోని పప్పులమిల్లు రోడ్డు



నేతాజీరోడ్డులో ఓ ఇంటి గోడకు వేసిన మార్కింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలో రోడ్డు విస్తరణకు మార్కింగ్ పెట్టడం కలకలం రేపింది. ఇటీవల వీఎంసీ, రైల్వే అధికారులు మధురానగర్ నేతాజీరోడ్డు..40 అడుగుల ఈ మార్గాన్ని 80అడుగుల మేర విస్తరించేందుకు మార్కింగ్ పెట్టారు. నేతాజీ రహదారి నుంచి గుడివాడ రైలుమార్గం మీదుగా బీఆర్టీఎస్ రోడ్డు వరకు ఫైవంతెన నిర్మిస్తారంటూ సాగుతున్న ప్రచారం నేతాజీ కాలనీ వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఫైవంతెన నిర్మాణానికి ఏ మాత్రం అనుకూలంగా లేని నేతాజీరోడ్డులో ఎలా కడతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో సూచించిన ప్రకారం పప్పుమిల్లు రోడ్డులో ఫైవంతెన ఏర్పాటు చేస్తే అమోదయోగ్యంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లలోపల 10అడుగుల వరకు మార్కింగ్..

మధురానగర్ నేతాజీరోడ్డులో రెండు మలుపులు తిరిగి ఫైవంతెన నిర్మించడం కూడా సాధ్యం కాదని స్థానికులు అంటున్నారు. మధురానగర్‌లో ఏలూరు కాలువగట్టు ప్రధాన రహదారి నుంచి ప్రారంభమయ్యే నేతాజీ మార్గం రెండు మలుపులు తిరిగి కమ్యూనిటీ హాలు వరకు ఉంది. ఈ రహదారి కొన్నిచోట్ల 30 అడుగులుంటే మరికొన్ని ప్రాంతాల్లో 40అడుగుల వరకు..చివరకు వచ్చేసరికి 25 అడుగులకే పరిమితమైంది. ఇప్పటికే ప్రధానరహదారిలో కొన్ని నివాసాలకు 8నుంచి 10అడుగుల లోపలకు మార్కింగ్ పెట్టారు. అధికారులు మాత్రం 80అడుగుల మేర విస్తరిస్తామని చెబుతున్నారు. దాదాపు 60ఇళ్లను 5 నుంచి 10అడుగుల మేర తొలగించాల్సి ఉంటుందని మార్కింగ్ ఇవ్వడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పప్పులమిల్లు రోడ్డులో నిర్మించాలి..

గత ప్రభుత్వ హయాంలో దావు బుచ్చయ్యకాలనీ నుంచి బుడమేరు, ఏలూరు కాలువ మీదుగా పప్పులమిల్లు రోడ్డు నుంచి బీఆర్టీఎస్ రోడ్డుకు వంతెన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈమార్గం మీదుగా వంతెన నిర్మిస్తే అన్నివర్గాలకు ఉపయోగకరంగా ఉంటుంది. దావు బుచ్చయ్యకాలనీ నుంచి బీఆర్టీఎస్ రోడ్డుకు దగ్గరి దారి కూడా అవుతుంది. దావు బుచ్చయ్యకాలనీ, జీవీఆర్‌నగర్, వినాయకనగర్, గుణదల, వెంకటేశ్వరనగర్, హనుమాన్‌నగర్ తదితర ప్రాంత వాసులకు రాకపోకలకు వీలుగా ఉంటుంది. వాంబే కాలనీ నుంచి దావు బుచ్చయ్య కాలనీ డొంకరోడ్డు మీదుగా బుడమేరు, ఏలూరు కాలువ, పప్పులమిల్లు రైల్వేగేటుపై నుంచి వంతెన నిర్మిస్తే అజిత్‌సింగ్‌నగర్ వంతెనపై భారం తగ్గి ట్రాఫిక్ సమస్యలు సైతం తగ్గుతాయి. సువిశాలంగా ఉండే ఈ మార్గంలో వంతెన నిర్మించటం సులభతరం అవుతుందని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మధురానగర్‌లోని నేతాజీ రోడ్డు

నివాసాల తొలగింపు చర్యలు తగవు..



మలుపులతో ఇరుకుగా ఉండే నేతాజీకాలనీ మీదుగా ఫైవంతెన నిర్మాణానికి సర్వే చేయడం ఆందోళనగా ఉంది. ఈమార్గం మీదుగా వంతెన కోసం కొన్ని నివాసాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే కొన్ని నివాసాలకు మార్కింగ్ చేశారు. సువిశాలంగా ఉండే పప్పులమిల్లు రోడ్డు మీదుగా వంతెన నిర్మిస్తే ఎవరికీ ఇబ్బందులు ఉండవు. పాలకులు స్పందించి పప్పులమిల్లు రోడ్డుమీదుగా వంతెన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

–ఎస్‌కే చాంద్‌బాషా, నేతాజీ కాలనీ

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

క్షేత్రస్థాయి పర్యటనలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



విజయ కాన్వెంట్‌లో డ్రిల్ చేయిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): అగ్ని ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కార్మల్ నగర్‌లోని సెయింట్ మేరీ విజయ కాన్వెంట్, చుట్టుగుంటలోని మెట్రో హోల్ సేల్ మార్ట్‌ను సందర్శించారు. తొలుత సెయింట్ మేరీ విజయ కాన్వెంట్‌ను సందర్శించి అక్కడున్న ఫైర్ సేఫ్టీ పరికరాలను పరిశీలించారు. అగ్ని ప్రమాదం తలత్తిన వెంటనే ఎటువంటి చర్యలు తీసుకోవాలి వంటి అంశాలపై ఫైర్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కలిప్పించారు. అలాగే మెట్రో కాంపౌండ్‌లో ఫైర్ ఇంజిన్ తిరగటానికి అనుకూలంగా ఉందా లేదా అని పరిశీలించారు. అక్కడున్న మంటలను ఆర్పే పరికరాలు స్మోక్ డిటెక్టర్, ఫైర్ స్ప్రింక్లర్, ఈల్డ్ హైడ్రెంట్, తదితర అగ్ని ప్రమాద నివారణ పరికరాలను పరిశీలించారు. కరెంటు పోయినా ఎమర్జెన్సీ ఎగ్జిట్ కనపడేటట్టు రేడియం స్టిక్కర్లు దారిలో ఉండాలని సూచనలు ఇచ్చారు. మెట్రో మార్ట్ లో సెట్ బ్యాక్‌లో చిన్న లోపాలను గమనించి, ఉన్న లోపాలను సరిచేస్తేనే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తానని మెట్రో మేనేజర్‌కు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీ ఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు

ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



చలో ఢిల్లీ కార్యక్రమం వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన ఫెడరేషన్ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతీయ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 27న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి సందెపోగు ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు.

విజయవాడ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఛలో ఢిల్లీ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ప్రైవేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.నూతన విద్యా విధానంలో భాగంగా కేంద్రం తీసుకొస్తున్న ప్రతిపాదనలు ప్రాథమిక సూత్రాల ఉల్లంఘన కిందకే వస్తాయన్నారు. యూజీసీ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడాలని, వీసీల నియామాలను చట్టప్రకారం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టే దిశగా విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.యువరాజు, గుంటూరు జిల్లా కార్యదర్శి కె. జాన్‌బాబు , రాష్ట్ర కన్వీనర్ కె.గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌పై ప్రత్యేక డ్రైవ్



కాళేశ్వరరావు మార్కెట్‌లో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేస్తున్న ప్రజారోగ్య విభాగం అధికారులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించిన క్రమంలో వీఎంసీ ప్లాస్టిక్ విక్రయదారులపై ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు వీఎంసీ పరిధి సర్కిల్–1లోని కాళేశ్వరరావు మార్కెట్, సర్కిల్–2 పరిధిలోని ఎన్టీయార్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ప్లాస్టిక్ షాపులపై దాడులు నిర్వహించింది. ప్రజారోగ్య విభాగం ముఖ్య అధికారి డాక్టర్ సురేష్ బాబు ఆదేశాలతో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ యోగేంద్ర సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయాల షాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గురువారం ఒక్కరోజే కాళేశ్వరరావు మార్కెట్‌లోని పలు షాపుల్లో 200 కేజీల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు, తదితరాలను సీజ్ చేశామని అధికారులు తెలిపారు. ఆయా షాపుల ఓనర్లు, నిర్వహకుల నుంచి రూ. 50 వేలు జరిమానా విధించామని ప్రజారోగ్య విభాగం అధికారులు తెలిపారు. నగరంలోని భవానీపురం, కాళేశ్వరరావు మార్కెట్, గవర్నర్‌పేటలో పలు ప్రాంతాల్లో దాడులు చేసి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నప్పటికీ కొంతమంది వ్యాపారులు గొల్లపూడిలోని హోల్‌సేల్ మార్కెట్‌లో కొనుగోలు చేసి నగరంలో విక్రయాలు జరుపుతున్నారని, గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌పై కూడా జిల్లా యంత్రాంగం దృష్టిసారిస్తే నగరంలో పూర్తిస్థాయిలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయవచ్చని తెలిపారు.

నేడు మాతృభాషా దినోత్సవం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో 21 వ తేది శుక్రవారం ఘంటసాల సంగీత కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆర్.మల్లికార్జునరావు గురువారం ఒక ప్రటకనలో తెలిపారు. మాతృభాష గొప్పతనాన్ని చాటేలా భాషా వేత్తల ప్రసంగాలు, సంప్రదాయ నృత్యాలు, లలిత గీతాల కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు వివరించారు.

మాతృభాష ఎంతో విశిష్టమైనది



మాట్లాడుతున్న తెలుగు పండితుడు డాక్టర్ శామనపూడి వెంకటేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాతృభాష అమృత తుల్యం అని ప్రముఖ రంగస్థల నటులు, నంది బహుమతి గ్రహీత, తెలుగు పండితులు డాక్టర్ శామనపూడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలోని కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 'హృద్యం–తెలుగు పద్యం' అనే అంశంపై శామనపూడి వెంకటేశ్వరరావు అతిథోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ మాతృభాష విశిష్టతను సోదాహరణంగా వివరించారు. గయోపాఖ్యానం, పాండవోద్యోగం, సత్యహరిశ్చంద్రీయం తదితర సుప్రసిద్ధ నాటకాల్లోని పద్యాలను ఆలపించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరి నీరజ మాట్లాడుతూ మాతృభాష మాధుర్యాన్ని వివరించారు. తొలుత తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు విభాగం నిర్వహించిన 'పద్యానికి పది' అనే పోటీలో విజేతలకు తెలుగు భాషా చైతన్య సమితివారి సౌజన్యంతో నగదు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంతో ప్రాణాలకు రక్షణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): హెల్మెట్ కారణంగా ప్రమాదాల సమయంలో ప్రాణాలకు రక్షణ లభిస్తుందని, ప్రతీ వాహనచోదకుడు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. స్థానిక మధురానగర్ మెయిన్ రోడ్డులో గురువారం సాయంత్రం గుణదల పోలీసులు వాహన చోదకులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగిండం పోలీసుల కోసం కాదనే విషయాన్ని వాహనదారులు గుర్తించాలన్నారు. హెల్మెట్ వినియోగించని పలువురు వాహనచోదకులను మందలించారు. . కార్యక్రమంలో గుణదల పోలీసులు ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సెంట్రల్ నియోజకవర్గ అనుబంధ విభాగాల కమిటీలు నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మాతా ఉమామహేశ్వరరావు (యూత్ వింగ్), తోపుల వరలక్ష్మి(మహిళా విభాగం), రాయవరపు గణపతిరావు(బీసీ సెల్), గుడిసె శ్యామ్‌బాబు(ఎస్సీ సెల్), కుంభ రవివర్మ(ఎస్టీ వింగ్) అధ్యక్షులుగా నియమితులయ్యారు. అబ్దుల్ నజీర్(మైనార్టీ వింగ్), దుగ్గిపోగు కిరణ్‌కుమార్(క్రిస్టియన్ మైనార్టీ సెల్), మార్కపూడి సురేష్(స్టూడెంట్ వింగ్), కుక్కల బాబూరావు(మున్సిపల్ వింగ్), చల్లా సుధాకర్ (ఆర్టీఐ వింగ్), రోగులు సిమ్మినాయుడు (వలంటీర్స్ వింగ్), నందెపు సురేష్ ((గ్రీవెన్స్ సెల్), సింగంశెట్టి ప్రవీణ్‌కుమార్ (వాణిజ్య విభాగం), యెక్కల శంకరరావు (వీవర్స్ వింగ్), పసుపులేటి కోటేశ్వరరావు(వైఎస్సార్‌టీయూసీ), శీలం భవానిరెడ్డి(అంగన్‌వాడీ వింగ్), గంజి ఉదయ్‌కుమార్(లీగల్ సెల్), పేరూరి ప్రేమ్‌కుమార్(కల్చరల్ వింగ్), మీసాల సత్యనారాయణ (సోషల్ మీడియా వింగ్), మార్తి సాయివెంకట చంద్రమౌళి శాస్త్రి(ఐటీ వింగ్), మహమ్మద్ రఫీ (ఇంటిలెక్చువల్ ఫోరం), కంభం కొండలరావు(బూత్ కమిటీస్), యర్రంశెట్టి అంజిబాబు (పబ్లిసిటీ వింగ్) అధ్యక్షులుగా నియమతులయ్యారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్



విద్యార్థులతో కలిసి స్టడీమెటీరియల్ చూపుతున్న జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్

పాయకాపురం(విజయవాడరూరల్): పదోతరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఇన్‌చార్జి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లోని 145మంది విద్యార్థులకు గురువారం ప్రభుత్వం సరఫరా చేసిన స్ఫూర్తి స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి హైస్కూల్‌కు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధిక, సునందు, నరసింహమూర్తి, నిర్మల, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి ఏబీ ఆనంద్



ఏబీ ఆనంద్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న బీ వెంకటేశ్వర్లు

విజయవాడకల్చరల్: విజయవాడ ఆకాశవాణి కార్యక్రమ ప్రయోక్త ఏబీ ఆనంద్ బహుముఖ ప్రతిభాశాలి అని విజయవాడ దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రం సంచాలకుడు బీ వెంకటేశ్వర్లు కొనియాడారు. తెలుగు కళావాహిని, శ్రీకళాభారతి, డాక్టర్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, తల్లపురెడ్డి లక్ష్మీ శ్రీనివాసరెడ్డి చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై ఏబీ ఆనంద్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆనంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏబీ అనంద్ సుదీర్ఘకాలం ఆకాశవాణిలో సేవలు అందించడంతోపాటు అనేక మంది సాహితీవేత్తలను ఆకాశవాణి ద్వారా పరిచయం చేశారన్నారు. ఉషశ్రీ ధర్మసందేహాలు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించినట్లు గుర్తుచేశారు. సాహితీవేత్త ప్రభాకర్ మాట్లాడుతూ ఏబీ ఆనంద్ జీవిత విశేషాలను వివరించారు. వివిధ రంగాలకు చెందిన మాడుగుల రామకృష్ణ, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతకాయల చిట్టిబాబు, గోళ్ళ నారాయణరావు, సింగంశెట్టి చంద్రశేఖర్, సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావు మాట్లాడుతూ ఏబీ ఆనంద్‌తో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సాహితీ ప్రపంచానికి రేడియో ద్వారా చేసిన సేవలను వివరించారు. ఈసందర్భంగా నిర్వహించిన సంగీత విభావరిలో గాయనీ గాయకులు మల్లాది స్వాతి, మల్లీశ్వరి, సూర్యకామేశ్వరి, బ్రహ్మం పాల్గొని పలు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.రమేష్‌బాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఇటీవల గుంటూరులో జరిగిన ప్రథమ మహాసభ తీర్మానాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్రవ్యాప్తంగా 15వేల మంది వివిధ కేడర్లలో తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్నారన్నారు. వీరందరికి ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, వేతనాలు పెంచేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్, గౌరవాధ్యక్షుడు వెలుగురి రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర నాయకులు సునీల్ కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్ నాశనం

అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ దామోదర్



లబ్బీపేట(విజయవాడతూర్పు): ర్యాగింగ్‌కు పాల్పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. దామోదర్ అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ర్యాగింగ్ నిరోధక విభాగం ఆధ్వర్యంలో గురువారం ర్యాగింగ్ వల్ల విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులు, డ్రగ్స్ వాడకం, సైబర్ క్రైం వంటి అంశాలపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏసీపీ కె. దామోదర్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యల్లో భాగంగా మూడు నెలల నుంచి పదేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా కళాశాల ర్యాగింగ్ నిరోధక విభాగంతో పాటు, స్థానిక పోలీస్‌స్టేషన్ సహకారం తీసుకోవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ. సునీత మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్‌ను ఏ రూపంలోనూ ఉపేక్షించమన్నారు. మాచవరం సీఐ సీహెచ్ ప్రకాష్, సదస్సు కార్యనిర్వాహణాధికారి డాక్టర్ జి. రమణ తదితరులు పాల్గొన్నారు.